
చీరాల బేర్‌పేటలో విద్యుత్ అలంకరణలో చర్చి


వలపర్ల లూథరన్ చర్చిలో క్యాండిల్ లైట్ ప్రార్థనల్లో మహిళలు


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో మేరీమాత

లోక రక్షణకే క్రీస్తు జననం

- ఘనంగా క్రిస్మస్ పండుగ
- వాడవాడలా సంబరాలు
- కిటకిటలాడిన చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు

అద్దంకి రూరల్/బల్లికురవ/మేదరమెట్ల/జే.పంగులూరు/అద్దంకి: పాపాలతో నిండిన ఈ జగత్తును తన పరిశుద్ధ ఆత్మతో సంస్కరించిన లోక రక్షకుడైన క్రీస్తు జన్మించిన క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్న, పెద్ద అన్న తేడా లేకుండా అందరూ చర్చిలకు వచ్చి ఏసు క్రీస్తు తమను కాపాడమని ప్రార్థనలు చేశారు. అద్దంకి మండలంలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. దీనిలో భాగంగా ఆయా చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. అద్దంకిలో పసుమర్తిపాలెం, కట్టకిందపాలెం, వాడవాడలా ఉన్న చర్చిల్లోను క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా బైబిల్‌లో పాస్టర్‌లు ఏసుక్రీస్తు బోధించిన సందేశాలను చదివి వివరించారు. సర్వమానవాళికి రక్షకుడు ఏసుక్రీస్తు అన్నారు. పండగ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో బంధు మిత్రుల రాకతో పండగ వాతావరణం నెలకొంది.

■ పట్టణంలోని గరటయ్య కాలనీలోని బిలీవర్స్ చర్చిలో ఫాదర్ కాంతారావు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం సండే స్కూల్ పిల్లలతో ప్రదర్శన నిర్వహించారు. అదే విధంగా మండలంలోని తిమప్మాయపాలెం రామాయపాలెం, తదితర గ్రామాల్లోనూ పండుగ జరుపుకున్నారు.

■ ప్రేమ, దమ, శాంతి మార్గాలను చూపిన ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవులకు ఆచరణీయమని పాస్టర్‌లు బండారు సురేష్‌కుమార్, సుబ్బారావు, వీరయ్య, ముసలయ్య అన్నారు. బల్లికురవ మండలంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. చెన్నుపల్లి, వల్లాపల్లి, కొప్పెరపాడు, కూకట్లపల్లి, వైదన గ్రామాల్లోని చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. కొవ్వొత్తులో ఏసు నామంతో ర్యాలీ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

■ జే.పంగులూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. అరికట్లవారిపాలెంలో గ్రామంలో క్రైస్తవులు ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం..

కారంచేడు/చినగంజాం/మార్టూరు/యద్దనపూడి: సర్వలోక మానవాళి సంపూర్ణ రక్షణ కోసమే లోకంలో ఏసుక్రీస్తు జన్మించారని స్థానిక లూర్థుమాత చర్చి ఫాదర్‌లు విజయ్ సందీప్, సతీష్‌లు అన్నారు. బుధవారం వేకువజాము నుంచే ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరు ప్రేమ, ఆప్యాయత, శాంతి, సహనం కలిగి జీవించాలని ఆయన సందేశమిచ్చారు. కారంచేడు బేతస్థ ప్రార్థనా మందిరం, ఎల్‌ఈఎఫ్ చర్చిల్లో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమాల్లో మహిళలు, చిన్నారుల ప్రత్యేక కీర్తనలు ఆకట్టుకున్నాయి.

■ పర్చూరు మండలంలోని అన్ని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. కరుణామయుడు చూపిన బాటలో అందరూ పయనించి దానధర్మాలు చేయాలని పాస్టర్లు సూచించారు. ఈసందర్భంగా రెవరెండ్ డాక్టర్ కొమ్మిన జోసెఫ్ కేరి మాట్లాడుతూ క్రీస్తు పుట్టుక లోకానికి వెలుగునిచ్చిందని తెలిపారు.

■ క్రిస్మస్ పండుగ సందర్భంగా 100 మంది నిరుపేదలకు నాగులపాలెం గ్రామానికి చెందిన దిడ్ల స్వామి, మేరీ రోజ్ లీనా దంపతులు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ డాక్టర్ చంద్రపాల్, పులిపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

■ క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని మార్టూరు మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వాక్యోపదేశం చేశారు.

■ సర్వలోక మానవాళి రక్షణ కోసం దివిపై అవతరించిన క్రీస్తుకు దివ్య బలిపూజ సమర్పించారు. మండల కేంద్రమైన యద్దనపూడిలోని ఎపిఫానియా క్రీస్తు లూథరన్ దేవాలయంలో రెవరెండ్ రిచర్డ్స్ పచ్చ దైవసందేశాన్ని అందించారు. పూనూరు ఆంధ్ర లూథరన్ ఇవాంజికల్ చర్చిలో పాస్టర్ బొందు రాజేష్, బేతేలు ప్రార్థనా మందిరంలో మల్లవరపు జీవన్, యనమదల ప్రార్థనా మందిరంలో హానోకు, టీచర్ పుష్పవేణి పండుగ ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం దైవసందేశాన్ని అందించారు.


మల్లాయపాలెంలో క్రిస్మస్ కేక్‌కట్ చేస్తున్న చిన్నారులు


అలంకరణలో ఆరికట్లవారిపాలెం చర్చి


బేర్‌పేటలోని సెయింట్ లూక్స్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ ట్రీ


చీరాలలోని సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చిలో క్యాండిల్ లైట్ నిర్వహిస్తున్న క్రైస్తవులు


వలపర్ల చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు

ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

చీరాల: క్రిస్మస్ పండుగను చీరాల పట్టణ, రూరల్ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణ, పరిసర ప్రాంతాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. చీరాలలోని 100 సంవత్సరాల చరిత్ర గల సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి, బేర్‌పేట, బేర్ ఆస్పత్రి ఆవరణలోని సెయింట్‌లూక్స్ చర్చి, జాన్‌పేటలోని సెయింట్ మార్క్స్ లూథరన్ జాన్ చర్చి, బెరాక చర్చి, ఉజిలిపేటలోని సెయింట్ మార్క్స్, మన్నా ప్రార్థనా మందిరాలలో లోకరక్షకుని జన్మదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చీరాలలోని సెయింట్ మార్క్స్ లూథరన్ సెంటినరీ చర్చిలో జరిగిన ప్రార్థనలలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావులు పాల్గొన్నారు. అలానే హారిస్‌పేట, థామస్‌పేట, హయ్యర్ పేట, జాన్‌పేట, జయంతిపేట, మరియమ్మపేట, మేరిక్రిస్టియన్‌పేట, ఐక్యనగర్, ఆనందపేట, శాంతినగర్, విఠల్‌నగర్, సాల్మన్‌సెంటర్, రామకృష్ణాపురం, ఈపూరుపాలెం, వాడరేవు తదితర ప్రాంతాలలోని ప్రార్థనా మందిరాలను క్రిస్మస్ సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు.


ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్


అద్దంకి చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు


చర్చిలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కొండయ్య


అద్దంకి భక్తులు కాలనీలో చర్చిలో కొవ్వొత్తులతో ప్రార్థనలు చేస్తున్న మహిళలు


కారంచేడులో క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు


బల్లికురవలో క్యాండిల్ లైట్ నిర్వహణ


గరటయ్య కాలనీలో బిలీవర్స్ చర్చిలో వేడుకలు..


నాగులపాలెంలో దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు


పర్చూరులో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు


కోనంకి ఎస్సీ కాలనీలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు


వల్లాపల్లిలో నేలవాలిన వరిపైరు

అల్పపీడనంతో ఆందోళనలో రైతులు

బల్లికురవ: అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న చిరుజల్లులు, ఈదురుగాలుల ప్రభావానికి ఆరుగాలం కష్టించి పండించిన వరి నేలవాలిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ నుంచి వరుస తుఫాన్‌లు, అల్పపీడన ప్రభావంతో ఈఏడాది పంటలు చేతికందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. సాగర్ ఆయకట్టు బోర్ల కింద ఖరీఫ్‌లో కూకట్లపల్లి, గొర్రెపాడు, కొప్పెరపాడు, వల్లాపల్లి, వైదన కొమ్మినేనివారిపాలెం, గుంటుపల్లి, ముక్తేశ్వరం గ్రామాల్లో వరి ప్రస్తుతం కోత దశలో ఉంది. తుఫాన్ హెచ్చరికలతో అధికారులు వరికోతలు నూర్పిళ్లు వాయిదా వేసుకోవాలని సూచిస్తున్నారని వర్షాల ప్రభావానికి పూర్తిగా నేలవాలి మొలకలు వస్తున్నాయని రైతులు గోగులమూడి శ్రీనివాస రెడ్డి, తాటిపరి ఎల్లారెడ్డి, దేవగిరి అంజిరెడ్డి సాక్షికి తెలిపారు. ఎకరా వరిపైరు సాగుకు సొంత భూముల్లో రూ. 40 వేల వరకు పెట్టుబడులు పెట్టామని తుఫాన్‌ల ప్రభావంతో పంట చేతికందే పరిస్థితి లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.


కూకట్లపలిలో నేలవాలిన వరి పైరును చూపిస్తున్న రైతులు

నిర్భాగ్యుల కోసం హెల్పింగ్ హ్యాండ్స్

- కష్టాల్లో ఉన్న కుటుంబాలకు సాయం
- స్ఫూర్తిగా నిలుస్తున్న సంస్థ

మార్టూరు: మానవ సంబంధాలన్ని ఆర్థిక సంబంధాలే అని కారల్ మార్క్స్ శతాబ్దాల క్రితం చెప్పిన మాటలు నిజమే అనడానికి ప్రస్తుత సమాజంలో మనం అనేక ఉదంతాలు చూస్తున్నాం. అయితే ఇది పూర్తిగా నిజం కాదని సొంత లాభం కొంత మానుకొని తోటి వారికి సాయపడే మనుషులు ఉన్నారని నిరూపిస్తున్నారు. అందుకు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య సగటు వయస్సు కలిగిన ఓ మిత్ర బృందం మార్టూరులో నిరూపించే ప్రయత్నం చేస్తోంది. నాణేనికి మరో పార్శ్వాన్ని సమాజానికి చూపే ప్రయత్నం చేస్తున్నారు మార్టూరుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు. 8 నెలల క్రితం మిత్ర బృందం మార్టూరులో ప్రారంభించిన ఓ చిన్న ప్రయత్నం కాలం గడిచే కొద్దీ ఎంతోమందికి స్ఫూర్తిదాయకమైంది. మార్టూరుకు చెందిన పఠాన్ ఖాదర్ వలీ (68) వృత్తి రీత్యా టైలర్. గతంలో రాజకీయాలు, కళారంగం ద్వారా ఏదో సేవ చేయాలని చూసినా అందులో ఆయనకు ఎలాంటి సంతృప్తి దొరకలేదు. కనీసం చివరి మజిలీలో అయినా అనాథలు, బుద్ధి మాంద్యంతో బాధపడేవారు, పూర్తిగా మంచానికే పరిమితమై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి కోసం కొంతైనా చేయాలనే తపన, ఆలోచనల నుంచి పుట్టిందే హెల్పింగ్ హాండ్స్ సంస్థ. ప్రారంభంలో ఖాదర్ వలి తన టైలరింగ్ కస్టమర్లతో పాటు తనకు బాగా పరిచయం ఉన్న సన్నిహితులతో తన ఆలోచనలను పంచుకున్నాడు.

100 మంది సభ్యులతో సాయం..

నెలకు రూ.100 సాయంతో కూడా కొంతమంది నిర్భాగ్యులకు అండగా నిలవచ్చనే ఖాదర్ వలి ఆలోచనలతో వారు ఏకీభవించారు. అనుకున్నదే తడవుగా 50 మంది సభ్యులతో 2024 ఏప్రిల్లో ప్రారంభించిన సంస్థ నెలకు రూ.100 చొప్పున ప్రతినెల ఖాదర్ వలికి అందజేస్తారు. ఈ సభ్యులలో రోజువారి కూలీలు, ఓ రిటైర్డ్ ఎస్సై, ఓ శిల్పకళాకారుడు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే రకరకాలవారు ఉన్నారు. వీరంతా స్థానికంగా జీవిత చరమ దశలో ఉండి మంచానికే పరిమితమై కాలాన్ని వెళ్ల దీస్తూ నిరాదరణకు గురైన వారిని, నిర్భాగ్యులను గుర్తిస్తారు. ప్రాధాన్యత క్రమంలో నెలకు ఓ కుటుంబానికి రూ.5000 ఆర్థిక సాయం అందించటం ప్రారంభించారు. వీరి సేవా కార్యక్రమం ఐదు ఆరు నెలల పాటు సజావుగా జరగడం సంస్థ గురించి ఆ నోటా ఈ నోటా విన్నవారు మేము సైతం అంటూ ముందుకు వచ్చిన వారితో ప్రస్తుతం సుమారు 100 మంది సభ్యులు తయారయ్యారు. వీరిలో హైదరాబాదు, రాజమండ్రి, గుంటూరు, విజయవాడ వంటి సుదూర ప్రాంతాల వారు సైతం ఉండటం విశేషం. వీరంతా ఖాదర్ వలికి నెల నెలా రూ.100 చొప్పున ఫోన్ పే ద్వారా పంపుతారు. ఇలా వచ్చిన మొత్తాన్ని ఖాదర్ వలి ప్రతినెల అందరికీ వాట్సాప్ గ్రూపుల ద్వారా లెక్కలు చూపుతారు. బాధితులకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులను సైతం అందిస్తున్నారు. మార్టూరు కేంద్రంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న వీరి సేవా కార్యక్రమాలు ప్రస్తుతం మండలంలోని మరికొన్ని గ్రామాల వరకు వ్యాపించాయి.


దివ్యాంగునికి ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

గ్రూపు సభ్యుల సాయంతోనే ఇది సాధ్యమైంది..

మా గ్రూపు సభ్యుల సహకారం పారదర్శకంగా మేము చేస్తున్న ప్రయత్నంతో మా సేవలను అంచెలంచెలుగా విస్తరించగలుగుతున్నాం. మేము చేసే సాయం కొద్దిపాటిదే అయినా ఆ సహాయాన్ని అందుకుంటున్న ఆ అభాగ్యుల కళ్లల్లో వస్తున్న ఆనందం మమ్మల్ని మరింత సాయం చేసేలా చేస్తోంది. దాతల సాయం అందుతున్నంత కాలం ఈ ప్రయత్నాన్ని ఇలాగే ముందుకు తీసుకు వెళ్తాం.

– పఠాన్ ఖాదర్ వలి, హెల్పింగ్ హాండ్స్ సంస్థ అధ్యక్షుడు